క్లుప్తంగా

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కదిరి: మున్సిపల్ కౌన్సిల్ సమావేశం బుధవారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఓ సంయుక్త ప్రకటన విడుదల చేశారు. సాధారణ కౌన్సిల్ సమావేశం అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు అదే కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ కౌన్సిల్ ప్రత్యేక సమావేశం ఉంటుందని అందులో పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమావేశంలో చైర్‌పర్సన్ ప్యానల్ కమిటీతో పాటు కాంట్రాక్టు కమిటీల ఎంపిక కూడా ఉంటుందని తెలిపారు. కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులతో పాటు ఆయా శాఖల మున్సిపల్ అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పటిష్టం



రికార్డులను పరిశీలిస్తున్న సీఐ వెంకటేశ్వర్లు

తనకల్లు: రాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో నిఘా పటిష్టం చేయనున్నట్లు కదిరి రూరల్ సీఐ వెంకటేశ్వర్లు తెలిపారు. మంగళవారం ఆయన తనకల్లు పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, రికార్డులు, రిజిష్టర్లు పరిశీలించారు. కర్ణాటక మద్యం, ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని ఆదేశించారు. సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలు సాగించేవారిపైన, శాంతి భద్రతలకు ఆటంకం కలిగించేవారిపైన చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఐ ధరణి బాబు పాల్గొన్నారు.

వేలం పాట వాయిదా

తనకల్లు: మండలంలోని కొక్కంటి నారప నాయుని చెరువులో చేపలు పట్టుకోడానికి నిర్వహించాల్సిన వేలం పాటను కదిరి డివిజన్ అధికారి ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు కార్యదర్శి బాబ్జాన్ మంగళవారం తెలిపారు. తదుపరి వేలంపాట తేదీని త్వరలో ప్రకటిస్తామని చెప్పారు.

కొల్లాపురమ్మకు ప్రత్యేక పూజలు



బత్తలపల్లి: మండల కేంద్రం బత్తలపల్లిలోని కొల్లాపురమ్మ ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున అమ్మవారిని ప్రధాన అర్చకులు ప్రత్యేకంగా అలంకరించారు. అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పూజల్లో పాల్గొన్నారు. మొక్కులు తీరిన భక్తులు మూగజీవాలను బలిచ్చారు.

'సత్యసాయి' నీరు పునరుద్ధరించండి

నల్లమాడ: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ బాపనకుంట, ఎస్సీ కాలనీ, నీరాలవంక తండాకు సత్యసాయి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవే పనుల్లో భాగంగా పైప్‌లైన్ ధ్వంసం కావడంతో కొన్ని రోజులుగా ఆయా గ్రామాలకు సత్యసాయి తాగునీటి సరఫరా నిలిచిపోయిందన్నారు. పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి సరఫరాను పునరుద్ధరించాలంటూ సత్యసాయి నీటి సరఫరా, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకుండా పోయిందని బాపనకుంటకు చెందిన సహకార సంఘం మాజీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

వాసవీమాతకు ప్రత్యేక అలంకరణ



ధర్మవరం అర్బన్: పట్టణంలోని కేపీటీ వీధిలో నున్న వాసవీ కన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో ఆషాఢ మాసం మొదటి మంగళవారం సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక ఆభరణాలతో అలంకరించారు. పూజలు, అభిషేకాలు చేశారు. భక్తులు పెద్ద ఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు.

పెద్దమ్మా .. చల్లగా చూడమ్మా!



ప్రత్యేక అలంకరణలో పెద్దమ్మ తల్లి



బోనాలతో ఆలయం వద్దకు చేరుకున్న భక్తులు

చెన్నేకొత్తపల్లి: మేడాపురంలో బోనాల పండుగ అంబరమంటింది. గ్రామపెద్దల ఆధ్వర్యంలో ఏటా ఆషాఢమాసంలో పెద్దమ్మతల్లికి నిర్వహించే బోనాల సమర్పణ ఈసారి కూడా కొనసాగింది. మంగళవారం ఉదయమే గ్రామ సమీపంలో కల్లును దుత్తలో ఉంచి, పూజ చేసి, అక్కడ జంతు బలి ఇచ్చిన తర్వాత ఊరేగింపుగా గ్రామ నడిబొడ్డున గల ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అక్కడ పెద్దమ్మతల్లి మూలవిరాట్‌కు అభిషేకాలు చేశారు. పలు రకాల పుష్పాలు, వెండి ఆభరణాలతో అలంకరించారు. ప్రతి గడప నుంచి మహిళలు భక్తిశ్రద్ధలతో బోనం (ప్రసాదం) వండి మేళతాళాల నడుమ ఆలయానికి ప్రదర్శనగా చేరుకున్నారు. బోనం తలపై పెట్టుకుని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసిన తర్వాత అమ్మవారికి సమర్పించి.. ఫల, పుష్పాలతో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామపెద్దలు మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐకమత్యంతో ఏటా పెద్దమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీ అని చెప్పారు. ఇలా చేయడం వలన గ్రామంలోని ప్రజలు సుఖశాంతులతో సంతోషంగా ఉంటారన్నారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండుతాయని తెలిపారు. బోనాల పండుగ సందర్భంగా ప్రతి ఇల్లూ బంధుమిత్రుల రాకతో కళకళలాడింది. ప్రత్యేక వంటలతో విందు ఆరగించి సంతోషంగా గడిపారు.



కల్లు కుండతో ఆలయం వద్దకు బయల్దేరిన దృశ్యం

వైభవంగా నేలకోటమ్మ శతజయంతి ఉత్సవాలు



పూజలందుకుంటున్న నేలకోటమ్మ అమ్మవారు

ముదిగుబ్బ: మర్తాడు గ్రామంలో మంగళవారం బోనాల పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మూడు రోజుల పాటు మర్తాడుతో పాటు దామానుపల్లి గ్రామాల ప్రజలు కలిసి నేలకోటమ్మ శత జయంతి ఉత్సవాలు నిర్వహించారు. చివరి రోజున అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బంధుమిత్రులు అధిక సంఖ్యలో రావడంతో గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది.

ప్రకృతి వ్యవసాయం శ్రేయస్కరం

ఎన్పీకుంట: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలతో పాటు అధిక దిగుబడులు పొందవచ్చని డీఆర్‌సీ ఏడీఏ సనావుల్లా పేర్కొన్నారు. జోగివారిపల్లికి చెందిన గంగయ్య వేరుశనగ పొలంలో మంగళవారం వ్యవసాయ అధికారులు ప్రకృతి వ్యవసాయ పద్ధతులను అనుసరించి జల జీవామృతం తయారీ విధానంపై ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధిక దిగుబడుల కోసం ఎరువులు, క్రిమి సంహారక మందులు విచ్చలవిడిగా వాడుతుండటంతో నేల కలుషితం అవుతోందని, దాని ప్రభావంతో దిగుబడులు భారీగా పడిపోతున్నాయని తెలిపారు. అలాకాకుండా ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో వ్యవసాయం చేయడం వల్ల భూసారంతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయని వివరించారు. అనంతరం మండల కేంద్రంలోని వ్యవసాయ శాఖ అధికారి కార్యాలయంలో రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించి.. వ్యవసాయానికి సంబంధించిన పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డీఆర్‌సీ ఏఓ అబ్దుల్ అలీ, మండల వ్యవసాయ అధికారి లోకేశ్వరరెడ్డి, ఏఈఓ శిరీషా, వీఏఏ, వీహెచ్ఏ, రైతులు పాల్గొన్నారు.



జల జీవామృతం తయారీ విధానాన్ని వివరిస్తున్న అధికారులు

కుటుంబ నియంత్రణ పద్ధతులు పాటించాలి

తాడిమర్రి: ప్రసవం కాగానే ప్రతి మహిళా కుటుంబ నియంత్రణ పద్ధతులను తప్పనిసరిగా పాటించాలని వైద్యాధికారి హరిత సూచించారు. తాడిమర్రి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం ఆమె హైరిస్క్ గర్భిణులకు వైద్య చికిత్సలు అందించి మందులు పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతినెలా టీకాలు క్రమం తప్పకుండా వేయించుకోవాలన్నారు. ప్రసవ సమయంలో 108 అంబులెన్స్ సర్వీసు వినియోగించుకోవడమే కాక సమీపంలోని ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని సూచించారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలన్నారు. గర్భిణులు ప్రసవం కాగానే కుటుంబ నియంత్రణ కోసం శస్త్ర చికిత్సలు చేయించుకోకుండా మాత్రలు లేదా ఇంజెక్షన్లు వేయించుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీలు, స్టాఫ్‌నర్సులు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి హరిత

విద్యుత్ వైర్ల చోరీపై ఫిర్యాదు

నల్లచెరువు: వ్యవసాయ పొలాల్లోని విద్యుత్ తీగల చోరీపై బాధిత రైతులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. పెద్దయల్లంపల్లి సమీపంలో రైతులు నరేంద్ర నాయుడు, వీరనారాయణ పొలాల్లో ఈ నెల మూడో తేదీన గుర్తు తెలియని వ్యక్తులు విద్యుత్ సరఫరా నిలిపేసి స్తంభం ఎక్కి 250 మీటర్ల వైరును కట్ చేసి ఎత్తుకెళ్లారు. దీన్ని ఆలస్యంగా గుర్తించిన బాధితులు మంగళవారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేయనున్నట్లు ఎస్ఐ లింగన్న తెలిపారు.

మొహర్రం ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి

కనగానపల్లి: గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను జరుపుకునేందుకు తప్పనిసరిగా పోలీసుల నుంచి అనుమతి పొందాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో మొహర్రం ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలన్నారు. గ్రామ పెద్దలతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు అందరూ కలసి పోలీస్ స్టేషన్‌కు వచ్చి అనుమతి పొందాలన్నారు. మొహర్రం ఉత్సవాల్లో ఎక్కడైనా వర్గ వైషమ్యాలతో ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో ప్రజలంతా ఐకమత్యంతో ఉండాలని పేర్కొన్నారు.

అవగాహనతో హైరిస్క్ పరిస్థితులకు చెక్

ఓడీచెరువు : ముందస్తు అవగాహనతో గర్భిణుల్లో హైరిస్క్ పరిస్థితులను అధిగమించి సాధారణ ప్రసవాలతో ఆరోగ్యకరమైన శిశువులకు జన్మనివ్వవచ్చని ఓడీచెరువు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) వైద్యాధికారి డాక్టర్ భానుప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి 70 మంది గర్భిణులను పరీక్షించి.. వారిలో 34 మందిని హైరిస్క్ కేటగిరీ కింద గుర్తించి అత్యవసర చికిత్స నిమిత్తం సిఫార్సు చేశారు. 21 మందికి ఉచిత స్కానింగ్, మందుల పంపిణీ చేశారు. గర్భిణులు, వారి సహాయకులకు కదిరి రోటరీ క్లబ్ వారి తరఫున పి.లక్ష్మీదేవి, వనిత, విష్ణులు పౌష్టికాహారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు అన్నదానం చేసేందుకు వచ్చిన రోటరీ క్లబ్ ప్రతినిధులు

అందుబాటులో పశుగ్రాసం విత్తనాలు

బత్తలపల్లి: పశుగ్రాసానికి సంబంధించి రైతులకు సబ్సిడీపై అందించే సీఎస్‌హెచ్ జొన్నరకం గడ్డి విత్తనాలు పశువైద్యశాలలో అందుబాటులో ఉన్నాయని పశుసంవర్ధక శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం పోట్లమర్రిలో పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఎం.శ్రీనివాసులు రైతులకు వివిధ రకాల పశుగ్రాసాలు, వాటి ప్రాముఖ్యత గురించి వివరించారు. సీఎస్‌హెచ్ జొన్న రకం గడ్డి విత్తనాలు సబ్సిడీ పోను కిలో రూ.23 చొప్పున రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. పాసుపుస్తకం, ఆధార్ తీసుకుని పశు వైద్యశాలలో సంప్రదించి గడ్డి విత్తనాలు తీసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది సురేష్‌నాయక్, పశుసంవర్ధక శాఖ సహాయకులు, పాడి రైతులు తదితరులు పాల్గొన్నారు.



పశుగ్రాసాల గురించి వివరిస్తున్న ఉప సంచాలకులు చంద్రశేఖర్

కొలువుదీరిన పీర్లు



ఎగువపేట చావిడిలో కొలువైన పీర్లు

తలుపుల : మొహర్రం సందర్భంగా మండల వ్యాప్తంగా ఆయా పీర్ల చావిడిలలో మంగళవారం పీర్లు కొలువుదీరాయి. నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు చదివింపులు ఉంటాయి. ఈ నెల 17న పీర్లు జలధికి వెళ్లనున్నాయి.

తూకాల్లో తేడా లేకుండా సరుకులు అందజేయాలి

రొళ్ల: రేషన్ షాపులు, కిరాణా షాపులతో పాటు వివిధ అంగళ్ల యజమానులు తూకాల్లో తేడా లేకుండా నిత్యవసర సరుకులు అందజేయాలని హిందూపురం తూనికల కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ శివశంకర్ పేర్కొన్నారు. మంగళవారం మధ్యాహ్నం పిల్లిగుండ్ల, అలుపనపల్లి, దొడ్డేరి ఎఫ్‌పీ షాపుల్లో అందిస్తున్న సరుకులతో పాటు గ్రామాల్లోని అంగళ్లను స్కేళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా శివశంకర్ మాట్లాడుతు తూకాల్లో తేడాగా సరుకులు పంపిణీ చేసినట్లు తమ దృష్టికి వస్తే చర్యలు తప్పవన్నారు. ఏడాదికి ఒకసారి స్కేళ్ల రిపేరీ చేయించుకోవడంతో పాటు వాటికి సీలు వేయించుకోవాలని సూచించారు. ప్రజలు సరుకుల పంపిణీ విషయంలో తేడా కనిపిస్తే తూనికల కొలతల శాఖ అధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.



రేషన్ బియ్యం వాహనాన్ని తనిఖీ చేస్తున్న దృశ్యం

బుడ్డారెడ్డిపల్లిలో నీటి ఎద్దడి



రిపేరీకి నోచుకోని మోటారు

ధర్మవరం రూరల్: బుడ్డారెడ్డిపల్లిలో తాగునీటి ఎద్దడి తీవ్రరూపం దాల్చింది. రక్షిత తాగునీటి పథకం బోరు మోటారు మరమ్మతుకు గురైంది. రిపేరీకని బోరు నుంచి మోటారు బయటకు తీసి గ్రామ నడిబొడ్డున మర్రి చెట్టు వద్ద ఉంచారు. కానీ రిపేరీ చేయకుండా వదిలేశారు. దీంతో తాగునీరందక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

షూటింగ్ బాల్‌పోటీలకు 'హరీష్' విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులు

కదిరి అర్బన్: ఎరుకులవాండ్లపల్లిలోని హరీష్ పాఠశాల విద్యార్థులు సాయిగణేష్, నవీన్‌లు జిల్లా తరఫున రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఎంఎస్.కిరణ్ మంగళవారం తెలిపారు. బుక్కపట్నంలో శ్రీసత్యసాయి బాలుర ఉన్నత పాఠశాలలో ఉమ్మడి అనంతపురం జిల్లా షూటింగ్ బాల్ క్రీడాకారుల ఎంపిక కార్యక్రమం జరిగిందన్నారు. తమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న సాయి గణేష్, పి.నవీన్ ఎంపికైనట్లు ఆయన తెలిపారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో పోతలయ్యస్వామి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సంగమేశ్వరం రోడ్డు తిక్కస్వామినగర్‌లో మంగళవారం పోతలయ్యస్వామి, శ్రీ వీరదిమ్మమ్మ తల్లి ఆలయ 24వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక పల్లకీలో ఊరేగించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

ఉన్నతమైన విద్యాలయం

- అత్యున్నత బోధనా ప్రమాణాలు
- ఆహ్లాదకర వాతావరణంలో తరగతులు
- డిగ్రీ ఫలితాల్లో కేహెచ్ ప్రభుత్వ కళాశాల అదుర్స్



ప్రొజెక్టర్ ద్వారా బోధిస్తున్న అధ్యాపకురాలు

ధర్మవరం అర్బన్: ఆహ్లాదకర వాతావరణంలో అత్యుత్తమ బోధనా ప్రమాణాలతో అద్భుత ఫలితాలు సాధిస్తోంది ఆ కళాశాల. ఇక్కడ చదివిన ఎందరో విద్యార్థులు ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. స్వయం ఉపాధి, వ్యాపార రంగాల్లోనూ రాణిస్తున్నారు. అంతటి ఖ్యాతి గడించింది ధర్మవరంలోని తారకరామాపురంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల. 42 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ కళాశాలలో ప్రవేశాల కోసం విద్యార్థులు పోటీపడుతుంటారు. ఇక్కడ బీఏ పొలిటికల్ సైన్స్, బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఎస్సీ కంప్యూటర్స్, బీఎస్సీ మ్యాథమేటిక్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. సుదీర్ఘ అనుభవంతోపాటు పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హతలు ఉన్న అధ్యాపకులతో బోధన సాగుతోంది. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చే బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కళాశాల ఆవరణలోనే హాస్టల్ సౌకర్యం ఉంది. అధునాతన పరికరాలతో విద్యార్థుల శరీర సౌష్టవాన్ని పెంచేందుకు జిమ్ సదుపాయం కూడా ఉంది. 20 వేల పుస్తకాలతో గ్రంథాలయం నిర్వహిస్తున్నారు. ప్రతి విద్యార్థికీ ఒక కంప్యూటర్‌తో ఆధునిక కంప్యూటర్ ల్యాబ్, అత్యాధునిక ప్రయోగశాలలు అందుబాటులో ఉన్నాయి. అంతేకాదు పోటీ పరీక్షలకు అవసరమైన ప్రత్యేక శిక్షణ కూడా ఇస్తున్నారు. ప్రొజెక్టర్ ద్వారా డిజిటల్ బోధన ఈ కళాశాల ప్రత్యేకత. ఎన్ఎస్ఎస్ యూనిట్స్ ద్వారా విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. క్రీడల్లో ప్రోత్సహించి రాష్ట్రస్థాయిలో విజయం సాధించేలా శిక్షణ ఇస్తున్నారు. సువిశాలమైన క్రీడామైదానంతోపాటు పచ్చదనం మధ్య కళాశాల నిర్వహిస్తున్నారు. ఇక్కడ ఎన్‌సీసీ యూనిట్ కూడా అందుబాటులో ఉంది.



ఎన్‌సీసీలో మెలకువలు వివరిస్తున్న ప్రిన్సిపాల్ ప్రభాకర్‌రెడ్డి



అధునాతన కంప్యూటర్ ల్యాబ్



జిమ్‌లో విద్యార్థుల వ్యాయామాలు

పంచాయతీ కార్యదర్శి నిజాయితీ

మడకశిర: గుడిబండ మండలం రాళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి గోవిందప్ప తన నిజాయితీని చాటుకున్నారు. వివరాలు.. మడకశిరలోని ఓ హోటల్ వద్ద గుడిబండ మండలం హిరేతుర్పి గ్రామానికి చెందిన మహలింగప్ప అనే వ్యక్తి మంగళవారం తన మొబైల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. ఈ ఫోన్ రాళ్లపల్లి పంచాయతీ కార్యదర్శి గోవిందప్పకు దొరికింది. ఆయన వెంటనే మడకశిర పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఏఎస్ఐ బ్రహ్మానందరెడ్డికి అప్పగించారు. ఏఎస్ఐ తక్షణమే స్పందించి ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి ఫోన్ చేసి పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. గోవిందప్ప చేతుల మీదుగానే ఫోన్‌ను మహలింగప్పకు అందించారు.